# జాషువా దేశభక్తి కవిత్వము

**డా. జూరెడ్డి నిర్మల**

*తెలుగు అధ్యాపకురాలు, సెయింట్ జోసఫ్ మహిళా కళాశాల, విశాఖపట్నం*

**Received: Sep. 2019 Accepted: Oct. 2019 Published: Nov. 2019**

సాహిత్యానికి దేశభక్తి పుష్టినిస్తుంది . సాహిత్యం దేశభక్తిని ఉద్దీపింపజేస్తుంది . జాతీయ జీవితానికి సాహిత్యం ప్రతిబింబమే కాబట్టి గడచిన నూరేండ్ల నడుమ భారతీయ సాహిత్యంలో దేశభక్తి ఒక ప్రధాన కథావస్తువై , కమనీయ కావ్యాల అవతరణకు కారణమైంది . బంకింగ్ చంద్ర చటర్జీ రాసిన ' వందేమాతరం ' అనే గీతం స్వరాజ్యసమర శంఖారావమై దేశం నలుమూలాల ప్రతిధ్వనించింది .రవీంద్రనాథ్‌ఠాగూర్ మొదలైన మహాకవులు ప్రాచీన భారత విజ్ఞాన వైభవాన్ని కొనియాడుతూ , భారత జాతిలో నూతనోద్రేకమునకు తోడ్పడు రచనలు చేశారు . ఈ శతాబ్దం మొదట మనదేశంలో ఏర్పడిన రాజకీయ సంచలనానికి ఫలితంగా జాతీయతా ప్రబోధకాలైన కావ్యాలనేకం మనభాషలో వెలసినవి . చిలకమర్తి వారి ' భరతఖండంబు చక్కని పాడియావు ' అనే పద్యము తెలుగులో భారతజాతీయోద్యమ సంబంధమైన తొలి రచన అని చెప్పవచ్చు . గురజాడ వారు' దేశమును ప్రేమించుమన్నా ' అని ఎలుగెత్తి పాడారు . రాయప్రోలు , విశ్వనాథ , తుమ్మల , కొడాలి , దువ్వూరి , జాషువా , బసవరాజు ప్రభృతుల ఖండకావ్యాలు దేశభక్తి తెలుగునేలపై పండించిన బంగారు పంటలు .

అంగ్లేయ పాలకుల పదఘట్టన క్రింద మగ్గుతున్న భారతావని దాస్య శృంఖలాలు ఛేదించుటకు నడుము బిగించి తన అహింస ,సత్యాగ్రహ ఉద్యమాల ప్రాతిపై నడిపించిన గాంధీ మహాత్ముని గురించి వ్రాసిన ఖండకావ్యము ' బాపూజీ ' . ఈ ఖండ కావ్యములో గాంధీ జీవితాన్ని చక్కగా చిత్రించి యువతకు దేశభక్తులకు ఉత్సాహపు ఊపిరులందించిన ఘనత జాషువా గారిది . మధురమైన శైలితో చరిత్రకు తగిన భాషతో సంప్రదాయ బద్ధమైన ఛందములో సాగిన రచన ' బాపూజీ ' .
జాషువా రాసిన ' బాపూజీ ' కావ్యం గాంధీపై వచ్చిన కావ్యాలన్నింటిలోనూ ఉత్తమోత్తమైనది . గాంధీపై జాషువాకు ఉన్న గౌరవాన్ని , ప్రేమను , అతని మార్గముపై ఉన్న అనురాగాన్ని , దాన్ని ముందుకు తీసుకుపోయే తత్వాన్ని ఈ కావ్యంలో వెల్లడించారు జాషువా . గాంధీ మరణం జాషువాను అతలాకుతలం చేసింది . అతని పనులను , దేశానికి చేసిన సేవలను మానవాళికి అతడిచ్చిన సందేశాన్ని కరుణ రసాత్మకంగా రాస్తూ గాంధీజీకి నివాళి అర్పించాడు జాషువా .

" ఆగిపోయెనె ప్రపంచానందదంబైన
ఖదరు రాట్నాల ఝుంకార రవళి
ఇంకెనే శాశ్వతాస్పృశ్యుల నోదార్చి

నెనమూరు వేడి కన్నీటి బుగ్గ
పడిపోయెడి నేటికింత లభియించు
గండు పేదల నోటి కబలరాశి
విరిగి పోయెనే నేటి వరమంత్రకోటికి
న వలంబనంబైన యమరతరువు
గంట కొట్టిన మాదిరి మింటియందు
మండుచున్నాడు చండ మార్తాండమూర్తి
భారతజ్యోతి గప్పున నారిపోవ
ముజ్జగంబున జీకటి ముమ్మరించె " గాంధీ మరణంతో ఖద్దరు రాట్నాల ధ్వని ఆగిపోయిందనీ , అస్పృశ్యుల పెద్ద దిక్కు పోయిందని, పేదల నోటి కాడి బుక్క దూరమైందని ఆకాశంలో సూర్యుడు వెలుగుతున్నా మూడు లోకాల్లోనూ చీకటి ఆవరించిందని దు:ఖపడుతున్నాడు జాషువా . గాంధీజీ జాషువాకు ప్రపంచానికే వెలుగునిచ్చే ఆశాజ్యోతి .

ఏసుక్రీస్తులోని దయార్ద్ర హృదయం . గాంధీలోని సత్యనిరతని పొగడుతూ ఏసుక్రీస్తుతో గాంధీని పోలుస్తూ జాషువా రాసిన పద్యం అతని ధర్మపక్షపాతానికి నిదర్శనం .

" కలి కాలమ్మున యేసుక్రీస్తువని వక్కాణించె దిగ్దేశముల్
తులువల్ సల్పిన గాయముల్ మరల నీలో దోచి యేసుప్రభున్
దలపించెన్ ఋజువయ్యె నీదగు మహత్త్వ శ్రీ , భగత్యాగ శ
క్తులలో నెన్ని స్వరాజ్యముల్ , భువన వైకుంఠంబు లింపారునో " కలికాలంలో ఏసుక్రీస్తు లాంటివాడు గాంధీ అని , ఓ చెంపపై కొడితే మరో చెంప చూపుమని చెప్పిన గాంధీ మాటలు ఏసుక్రీస్తు బోధనలను తలపింప జేస్తున్నాయని, గాంధీజీ ఎన్నో స్వరాజ్యాలను స్థాపింపగల గొప్పవాడని, భూలోకం లోనే స్వర్గాన్ని నింపగల శక్తి గాంధీకి వుందని జాషువా అభిప్రాయం .

" గోచిపాత గట్టుకొని జాతి మానంబు
నిలిపినట్టి ఖదరు నేతగాడు
విశ్వసామరస్య విజ్ఞాన సంధాత
కామిత ప్రదాత , గాంధీతాత "

అని బాపూజీ విశిష్టతలను కొనియాడారు . అన్ని జాతుల వారును , అన్ని మతాల వారును , చివరికి ఆస్తికులైన , నాస్తికులైనను మహాత్మునకు అంజలి బట్టారు .

దేశంలో బహుమతాలుండడం వల్ల మానవులంతా ఒకటేనన్న భావం కరువై మతాల పేరు మీద కొట్టుకు ఛస్తున్న విధానం జాషువాను బాధించింది. ఈ విధానంపై కోపాన్ని ప్రదర్శిస్తూ సహనవిద్య, సర్వమత సహనం అవసరమని చెబుతూ అందుకు ఉదాహరణగా బాపూజీని ఆదర్శంగా తీసుకొమ్మని చెబుతున్నాడు జాషువా .

" పండ్లు నూరుచున్న బహుమతంబులలోన
సహనవిద్య నేర్పు సాధకుండు
భార్య బిడ్డ లున్న ప్రత్యక్ష దైవంబు

కామిత ప్రదాత , గాంధి తాత " మతాలు దేశంలో విలయతాండవం చేస్తున్న పమయంలో ప్రపంచానికే సహన విద్యను నేర్పిన వాడు గాంధీజీ . భార్యా బిడ్డలు , సంసార బంధనాలన్నీ ఉన్న ప్రత్యక్ష దైవమని,సర్వమత సహనాన్ని , మానవీయ విశ్వజనీన దృక్పథాన్ని జాషువా పై పద్యంలో చెప్పారు .

" అదిగో ! రాట్నముచేత నిమ్నజుల కాహారంబు గల్పించి య
భ్యుదయాపాదక సామరస్యమున కాయుర్దాయముం బోసి , అ
పదపాలై మరణించి , భస్మచయమున్ భాగించి , దేశాలపై
వెదజల్లించిన గాంధితాత ఋణమున్ విశ్వం బెటుల్ దీర్చునో " ఈవిధంగా జాషువా

రాట్నం , ఖద్దరు దివ్య గుణాలను స్తుతించారు .

" అచ్చపు క్రైస్తవుండనుచు నంజలి పట్టిరి క్రైస్తవోత్తముల్
పొచ్చెము లేని బౌద్ధుడని పూజలొనర్చిరి బౌద్ధభిక్షుకుల్
మచ్చరహించి మాముసలమానని పల్కె , దురుష్కలోకముల్
అచ్చ మహాత్ముడన్ననుడి కారుడు గాంధి ఫకీరు డెంతయున్ " ఎవరు ఎలా చూస్తే వారికి

అలా కనిపించే గాంధీ ఫకీరు మహాత్ముడు కాక ఏమవుతాడని గాంధీ గారి విశ్వమానవ శాంతి, అహింస భావాలను నూటికి నూరు పాళ్లు సమర్థిస్తున్నాడు జాషువా .

గాంధీజీ సాధించిన ఘన విజయాల్లో హరిజనోద్ధరణ మొకటి . జాషువా ఆ విషయాన్ని కూడా పలుతావుల ప్రస్తావించారు .

" నిమ్నజాతుల కంటి నీరంబు దుడిచి యా
శ్వాసించు నిఱుపేద బాంధవుండు " అని గాంధీజీ నిమ్నజాత్యుద్ధరణాన్ని కొనియాడారు .

కామిత ప్రదాత , గాంధి తాత " మతాలు దేశంలో విలయతాండవం చేస్తున్న పమయంలో ప్రపంచానికే సహన విద్యను నేర్పిన వాడు గాంధీజీ . భార్యా బిడ్డలు , సంసార బంధనాలన్నీ ఉన్న ప్రత్యక్ష దైవమని,సర్వమత సహనాన్ని , మానవీయ విశ్వజనీన దృక్పథాన్ని జాషువా పై పద్యంలో చెప్పారు .

గుజరాతులోని పోరుబందరు పట్టణమున పుట్టి గుజరాతుకు గౌరవము తెచ్చినాడు . చిన్ననాటి నుండి సత్యమునే మాటలాడుచు సన్మార్గములో పయనించిన మహానుభావుడు. చేవ గలిగిన బలగము చాలా ఉండియు వెతల పాలైన మాతృదేశమును చూచి వగచి, పదిపుట్ల సహనముతో ఆంగ్లేయులను నదిలించిన ధీశాలైన గాంధీని కొనియాడారు జాషువా .

" సత్యాగ్రహ స్వర్ణశంఖంబు పూరించి
స్వాతంత్ర్య సమర బీజములు నాటి
సీమబట్టలు ధరించెడు పుట్టుభోగికి
చేనేత మగ్గాలు చేతికిచ్చి
దొరల చేజిక్కిన భరత సామ్రాజ్యంబు
నుపవాసములచేత నూచి యూచి
స్వీయదేశీయ సిపాయి ఖైదీయౌట
గౌరవంబను సుద్దు గట్టిజేసి
పొదలు మంచుకొండ మొదలు సేతువుదాక
భారతంబు వెంట బరుగులెత్త
జడుపుగిడుపు లేని శాంతిపటాలంబు
సిద్ధపరచె ధర్మ బద్ధుడగుచు " స్వాతంత్ర్యం కోసం సత్యాగ్రహ సమర శంఖాన్ని పూరించాడని , విదేశీ వస్త్రాలు ధరించే భోగులకు చేనేత వస్త్రాలు ధరించమని చెప్పి స్వదేశీ ఉద్యమాన్ని నడిపాడనీ, సీమ దొరలు మోసంతో చేజిక్కించుకున్న భారతదేశాన్ని విముక్తం చేయడానికి ఉపవాసదీక్షలు చేశాడని, దేశం కోసం ఖైదీలుగా జైలుకు పోవడం జాతి గౌరవంగా భావించాడని గాంధీ గురించి అభిప్రాయ పడుతున్నాడు జాషువా. హిమాలయ పర్వతాల నుండి హిందూ మహాసముద్రము వరకు గాంధీ వెంట పరుగులు తీస్తుంటే గాంధీజీ శాంతి పటాలాన్ని సిద్ధపరిచిన బుద్ధ భగవానుడని శ్లాఘిస్తున్నాడు. ఇది జాషువా కోరిన సాంఘిక విప్లవం .

రాట్నము , రాట్నము ఉత్పత్తి చేసిన ఖాదీ భారత జాతీయ మహాసభ వారిచే ఆమోదింపబడింది. విదేశీ వస్తు బహిష్కరణ జయప్రదంగా కొనసాగించడానికి వీలుగా ఇరవై లక్షల రాట్నాలను స్థాపించాలని తీర్మానించారు. రాట్నము స్వాతంత్ర్య చిహ్నంగా పరిణమించి జాతీయ పతాక మధ్యమును స్థానం సంపాదించుకొంది . ఇలాంటి మహోత్కృష్టమైన రాట్నమును, అది ఉత్పత్తి చేయు ఖద్దరును జాషువా బహుధా ప్రశంసించారు .

" ముద్ద తరుగయ్యె పాపము
ఖద్దరుచే సీమ నేతగాండ్రకు , గుండెల్
ఖద్దరు ముని మ్రింగరాని కబళంబనుచున్ " ఆంగ్లేయులకు నష్టం కలిగించిన రాట్నమే భారతీయులకు కామధేనువై కూటికి గుడ్డకు లోటురానీయక విరాజిల్లిందని చెప్పాడు జాషువా .

" గాంధి నామకంబు గాంధి సందేశంబు
మారుమూలాలలందు మారుమ్రోగె
ఖండపంచకమును గౌగిలించినవాని
సీమశక్తు లేమి సేయగలవు ? " గాంధీ నామం, గాంధీ సందేశం దేశదేశాలకు, ఐదు ఖండాలకు మూలమూలలకు వ్యాపించిందని అలాంటి గాంధీజీని ఆంగ్లేయులు ఏమి చేయలేరనే ధీమను వ్యక్తం చేస్తున్నాడు జాషువా .

“ ఉప్పు సత్యాగ్రహంబున కుత్సహించి
కఱ్ఱమోపున జలధికి గదలునాడు
శాంత గంభీర భంగహస్తములు సాచి
యంజలి ఘటించె బాపూజి కద్ధిరాజు ” ఉప్పు సత్యాగ్రహమునకు ఉద్యమించి, ఉత్సాహముతో కఱ్ర పట్టుకొని సముద్రము కడకు వచ్చినపుడు గంభీర ముద్రతో తరంగములనెడి చేతులు చాచి అయనకు నమస్కారము పెట్టెనని బాపూజీ నిర్వహించిన ఉప్పుసత్యాగ్రహము గురించి చెప్పాడు జాషువా .

“ కదురును రాటము దాలిచి
యెదిరింపుడు రాచవారి, నీ యాయుధముల్
ముదమిచ్చు, నన్న వస్త్ర
ప్రదములు, టీ ప్రదములాంగ్ల పారివ తతికిన్ ” అని శాంతియుత పోరాటానికి కదురును, రాట్నమును చక్కని దివ్యాయుధాలని సందేశాన్ని చాటారు .

“ గాంధి రక్తధార క్ష్మాతలంబున జింది
ప్రభవమంద డొక్క బాపూజీయు
బాపుజీకి బదులు పదివేల గోడిసేల్
బ్రబలి రందు రేమి పాప మొక్కొ ! ” అని గాంధీ రక్తం ఈ భూమిపై చిందింది. ఆ రక్తంలోంచి ఒక్క బాపూజీ కూడా పుట్ట లేదు . కాని పదివేల మంది గాడ్సేలు వస్తున్నారని వాపోతున్నాడు జాషువా .

“ పూర్వ పశ్చిమగోళాలు మోకరించి
యే మహావ్యక్తి కొగి నమస్కృతులు సలిపె
నట్టి బాపూజి మనమధ్య బుట్టు కతన
సభ్యతాస్ఫూర్తి భరతవర్షమున కమరె ” తూర్పు, పడమటి దేశములు కూడా బాపూజీని ఎంతగానో ప్రశంసించినవి. మన మధ్య గాంధీజీ పుట్టుట వలన భారతావనికే పేరు ప్రఖ్యాతులు వచ్చాయి .

“ బాపూజీ ’ జీవితాన్ని , ఉదాత్త చరితను మధురమైన శైలిలో వర్ణించి ఆంధ్ర భారతికి అపూర్వాలంకారాలను , తమ కవిత్వానికి సాఫల్యసిద్ధిని సమకూర్చారు జాషువా .

ఆధారగ్రంథాలు ;- 1. జాషువా రచనలు – రెండవ సంపుటం. 2. కథానాయకుడు – జాషువా ( తెలుగు అకాడమి, హైదరాబాదు), 3. జాషువాతో అనుభవాలు, జ్ఞాపకాలు ( తెలుగు అ&ఆడమీ, హైదరాబాదు)

***